సాక్షి నల్లగొండ

ఆదివారం । 2 । జూన్ । 2024



టోల్ బాదుడు

65వ నంబర్ హైవేపై వాహనదారులు నుంచి వసూలు చేస్తున్న టోల్ ఫీజును జీఎమ్మార్ సంస్థ పెంచింది. - 8లో



పశువుల చోరీ ముఠా అరెస్ట్

పశువుల చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను తిరుమలగిరి(సాగర్) పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. - 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
42° / 30°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి శుభాకాంక్షలు

నల్లగొండ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో పోరాటాల ఫలితంగా స్వరాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయి పదకొండో ఏటా అడుగు పెట్టబోతున్నందుకు ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కృషిచేస్తుందని చెప్పారు.

లోక్‌సభ ఓట్ల లెక్కింపుపై నేడు అధికారులకు శిక్షణ

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపుపై ఆదివారం ఉదయం 9:30 గంటలకు నోడల్ అధికారులకు, 11:30 గంటలకు సూపర్‌వైజర్లు, సహాయకులకు నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు లోక్‌సభ ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు లోక్‌సభ ఎన్నికల సూక్ష్మ పరిశీలలకు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన రానున్న ఈ కార్యక్రమాలకు సంబంధిత అధికారులంతా తమకు కేటాయించిన సమయాల్లో తప్పకుండా హాజరు కావాలని కోరారు.

'నీరున్న చెరువుల్లోనే చేప పిల్లలు వదిలాం'

నల్లగొండ టూటౌన్ : నీరు ఉన్న చెరువుల్లోనే ఉచిత చేప పిల్లలను వదిలామని, ఈ ప్రక్రియ మండల స్థాయి అధికారుల సమక్షంలో జరిగిందని మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'సాక్షి'లో శనివారం 'మత్స్య మాయజాలం' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. నీరు లేని చెరువుల్లో చేప పిల్లలు వదలలేదని పేర్కొన్నారు. చేప పిల్లల పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని తెలిపారు. కలెక్టర్ ఆమోదంతో బిల్లుల చెల్లింపునకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

6న ఆలయ భూముల కౌలు వేలం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని రామగిరి రామాలయానికి నల్లగొండలోని దండెంపల్లిలో ఉన్న 53.24 ఎకరాల భూమి కౌలుకు జూన్ 6వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ జె.జయరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. గతంలో కౌలు బకాయి ఉన్న వారికి వేలంలో పాల్గొనేందుకు అర్హత లేదని తెలిపారు.

రేపు కేవీకేలో శిక్షణ

త్రిపురారం: వివిధ పంటల సాగులో మెళకువలను వివరించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శిక్షణ నిర్వహించనున్నట్టు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మేళాతోపాటు వానాకాలంలో పంటల ప్రణాళికలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందుస్తు అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఈ శిక్షణను ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ

కట్టంగూర్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు ఐక్యంగా కృషిచేయాలని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను శనివారం కట్టంగూర్ ఉన్నత పాఠశాలలో మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. అనంతరం దుగినవెల్లి, ముత్యాలమ్మగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ మేక నాగయ్య, ఏఈ వెంకటనర్సయ్య, మండల నోడల్ అధికారి అంబటి అంజయ్య, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు ఉన్నారు.





తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా ఆదివారం నిర్వహించే దశాబ్ది వేడుకలకు విద్యుత్ దీపాలతో అలంకరించిన నల్లగొండ కలెక్టరేట్, బస్టాండ్ సమీపంలోని సుభాష్‌చౌక్



నల్లగొండలోని పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరణకు పూర్తయిన ఏర్పాట్లు

సాగు పెరిగింది.. వైద్యం మెరుగైంది

పదేళ్లలో ప్రగతి బాట

మారిన నల్లగొండ జిల్లా రూపురేఖలు



- 11 లక్షల ఎకరాలకుపైగా పెరిగిన పంటల సాగు విస్తీర్ణం
- ప్రభుత్వ ఆస్పత్రుల ఆధునీకరణ.. మెరుగైన వైద్య సౌకర్యాలు
- రోడ్ల విస్తరణతో సులువైన ప్రయాణం
- పెండింగ్ ప్రాజెక్టులు ఎక్కడివక్కడే..

నేడు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం

అమరుల త్యాగాలు.. వెన్నుచూపని పోరాటంతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ జిల్లా ప్రగతి పథాన పయనిస్తోంది. ప్రతి రంగంలోనూ సమూల మార్పులు వచ్చాయి. ఆనాడు కరువు పీడిత ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు ఎటుచూసినా పచ్చని పంటలతో కళకళలాడుతోంది. వ్యవసాయ దిగుబడులు భారీగా పెరిగాయి. విద్యా, వైద్య రంగాలు విస్తరించాయి. ప్రజల రవాణా సౌకర్యం మెరుగుపడింది. జిల్లాలు, మండలాల విభజనతో పాలన చేరువైంది. పట్టణాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తయి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ప్రత్యేక కథనం.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లాలో ఈ పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. గతంతో పోల్చితే సుస్థిర అభివృద్ధికి బాటలు పడ్డాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా 2016లో మూడుగా విడిపోయి నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలు ఏర్పడ్డాయి. జిల్లాల విభజన జరిగిన తరువాత కొత్త జిల్లాల్లో అభివృద్ధి పరుగులు పెట్టింది. వ్యవసాయ రంగంలో పలు మార్పులు చోటు చేసుకోగా, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు అన్న చందంగా ఉన్నా.. కాలంకలిసి రావడం, సాగర్ ఎడమ కాలువ నీటితో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.





వరిసాగుకు రైతుల మొగ్గు..

నల్లగొండ జిల్లాలో పదేళ్ల కింద వ్యవసాయం రంగం అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది. సాగునీటి కొరత, విద్యుత్ కోతల కారణంగా జిల్లా వ్యాప్తంగా వానాకాలం, యాసంగి సీజన్లలో రైతులు వరి, పత్తి పంటలకు తక్కువగా సాగు చేసేవారు. రాష్ట్ర ఏర్పడిన తర్వాత కాలం కలిసి రావడం, విస్తారంగా వర్షాలు పడడం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి క్రమం తప్పకుండా సాగు నీటి విడుదల జరగడం, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌తో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రాష్ట్రం ఏర్పడకముందు ఉమ్మడి జిల్లాలో 4 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి ఉండగా, ఇప్పుడది 40 లక్షల టన్నులకు పెరిగింది. ఒక్క నల్లగొండలోనే లక్షన్నర టన్నుల నుంచి 10 లక్షల టన్నులకు పెరిగింది. రాష్ట్రం ఏర్పడకముందు పంటల సాగు 7.5 లక్షల ఎకరాలు ఉంటే ఇప్పుడది 11.48 లక్షల ఎకరాలకు పెరిగింది. అప్పట్లో లక్ష ఎకరాల్లో వరి సాగు చేయగా, దాదాపు 6 లక్షల ఎకరాల్లో పత్తి, 50 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేసే వారు. ఇప్పుడు వరి సాగు 5.05 లక్షల ఎకరాలకు పెరుగగా, పత్తి 5.66 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. రైతులకు మార్కెట్ కష్టాలు దూరమయ్యా. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ధాన్యం అమ్ముకోవడం సులభంగా మారింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్‌లు, వరినాటే యంత్రాలు, హార్వెస్టర్లు అందుబాటులోకి వారవడంతో కూలీల కొరతను అధిగమిస్తున్నారు.

పెరగని ఉద్యాన సాగు..

ఉద్యాన పంటలకు సబ్సిడీల కోత విధించడంతో అనేక రకాల పండ్ల తోటలు, కూరగాయలు, సుగంద ద్రవ్యాల సాగు పెరగలేదు. 2014–15లో అన్ని రకాల పండ్ల తోటలు 77,275 హెక్టార్లు ఉండగా కూరగాయల సాగు 8,414 హెక్టార్లు, సుగంధ ద్రవ్యాల సాగు 4,079 హెక్టార్లు ఉండేది. 2023–24 ఏడాదిలో పండ్ల తోటలు 56,716 హెక్టార్లు, కూరగాయల సాగు 6,684 హెక్టార్లలో ఉంది. సుగంద ద్రవ్యాల సాగు 4,085 హెక్టార్లలో ఉంది. 8263 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

2017 నుంచి పంటల సాగు ఇలా.. (ఎకరాల్లో)

సం.	సీజన్	వరి	పత్తి	మొత్తం
2017	వానాకాలం	1,59,152	5,83,800	8,41,756
	యాసంగి	2,41,777	----	2,58,004
2018	వానాకాలం	2,36,298	5,69,583	8,96,137
	యాసంగి	2,15,478	----	2,31,738
2019	వానాకాలం	3,36,566	7,13,762	11,39,989
	యాసంగి	3,72,048	----	3,98,312
2020	వానాకాలం	4,01,124	7,29,399	12,23,785
	యాసంగి	4,68264	----	5,51,924
2021	వానాకాలం	4,62,075	6,53,767	11,93,719
	యాసంగి	4,47,063	15	5,51,4,32
2022	వానాకాలం	5,04,208	6,45,775	12,07,164
	యాసంగి	5,56,800	114	6,35,726
2023	వానాకాలం	5,05,009	566191	11,48,739
	యాసంగి	4,20,523	----	5,04,492

నీలగిరి జిగేల్..

ఈ పదేళ్లలో నల్లగొండ జిల్లా కేంద్రం రూపురేఖలు మారాయి. పట్టణంలో రూ.145 కోట్లతో చేపట్టిన రహదారుల విస్తరణ, సుందరీకణ, సెంట్రల్ లైటింగ్‌తో పట్టణమంతా జిగేల్‌మంటోంది. రహదారుల మధ్యలో పచ్చని చెట్లు, రహదారులకు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మాణం, మర్రిగూడ, వీటీకాలనీ, ఎన్జీ కాలనీ, పెద్ద గడియారం సెంటర్‌లలో నిర్మించిన జంక్షన్లు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. నకిరేకల్ – మాచర్ల నేషనల్ హైవేతో పానగల్ ప్రాంతం, డీవీకే రోడ్ స్వరూపమే మారిపోయింది. బస్టాండ్ నుంచి పెద్దబండ వరకు, భాస్కర్ టాకీస్ నుంచి కలెక్టరేట్ వరకు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. పానగల్ బైపాస్‌లో కొత్తగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. మర్రిగూడ బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కొనసాగుతోంది. రూ.90 కోట్లతో నిర్మించిన ఐటీ టవర్‌తో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడుతున్నాయి. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి పాతబస్తీ మీదుగా హౌజింగ్ బోర్డు వరకు, డీవీకే రోడ్డు హిమగిరి కాలనీ మీదుగా పాతబస్తీ పూల్ వరకు డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టారు. దీంతోపాటు హాలియా, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, చండూరు, చిట్యాల, నాగార్జునసాగర్ రోడ్ల విస్తరణ, అభివృద్ధి జరుగుతోంది.



విస్తరించిన వైద్య సేవలు



జిల్లాలో వైద్య సేవలు విస్తరించాయి. పదేళ్ల కిందట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి సామర్థ్యం 500 పడకలు మాత్రమే. తెలంగాణ ఏర్పడ్డాక జిల్లా అస్పత్రులతో పాటు ఏరియా ఆస్పత్రుల్లో పడకల సామర్థ్యం పెంచి మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాకు మెడికల్, కళాశాల, నర్సింగ్ కళాశాల ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్ర ఆస్పతి సామర్థ్యం 850 పడకలకు పెరిగింది. మిర్యాలగూడ ఆస్పత్రిని వంద నుంచి 200 పడకలకు పెంచుతున్నారు. జీజీహెచ్‌లో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటుచేసి 34 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. 300 నర్సింగ్ పోస్టులను భర్తీ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల భవన సముదాయం పూర్తి కావస్తోంది. జీజీహెచ్‌తోపాటు నాగార్జునసాగర్, మిర్యాలగూడలో డయాలసిస్ యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. మర్రిగూడ, హాలియా పీహెచ్‌సీలను 50 పడకలకు పెంచే పనులు మొదలయ్యాయి.

సాగునీటి ప్రాజెక్టుల పనులు వెనుకంజ



జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఈ పదేళ్లలో ఒక అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ప్రధానంగా 2007లో ప్రారంభించిన ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు ముందుకు సాగడం లేదు. 2014 మే నెల వరకు 23 కిలోమీటర్ల మేర టన్నెల్ తవ్వితే, ఆ తరువాత నుంచి ఇప్పటివరకు తొమ్మిదిన్నరేళ్లలో 11.370 కిలోమీటర్ల టన్నెల్ తవ్వకమే పూర్తయింది. మొత్తంగా ఇప్పటివరకు 34.37 కిలోమీటర్లు మేర టన్నెల్ పూర్తికాగా ఇంకా 9.56 కిలోమీటర్ల పొడవునా తవ్వాల్సి ఉంది. పాలమూరు –రంగారెడ్డిలో అంతర్భాగంగా 2015లో డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టినా ఇంతవరకు నీటిని ఎక్కడి నుంచి ఇస్తారన్న అంశాన్ని తేల్చలేదు. మరోవైపు డిండి కింద నిర్మిస్తున్న సింగరాజుపల్లి, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాయినిపల్లి, చర్లగూడెం (శివన్నగూడెం) రిజర్వాయర్ల పరిధిలో చేపట్టిన పనులు ఆగిపోయాయి. 2009లో చేపట్టిన బ్రాహ్మణవెల్లెంల పనులను కూడా ఇప్పటివరకు ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. 2021 సాగర్ ఉప ఎన్నికల సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి శంకుస్థాపన చేసిన నెల్లికల్, పొగిల్ల, కంబాలపల్లి, అంబాభవాని, పెద్దగట్టు, అయిటిపాముల తదితర 15 ఎత్తిపోతల పథకాల పనులు కూడా కొనసాగడం లేదు.

జిల్లా కేంద్రంతో అనుసంధానం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రంతో ప్రతి మండలాన్ని అనుసంధానించేలా రెండు లేన్ల రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఇందుకోసం రూ.339 కోట్లు వెచ్చించింది. మాచర్ల–నకిరేకల్ నేషనల్ హైవే పూర్తి కావచ్చింది. నల్లగొండ పట్టణంలో బైపాస్ రోడ్డు వేయాల్సి ఉంది. మిర్యాలగూడ నుంచి దేవరకొండ మీదుగా జడ్చర్ల వరకు నేషనల్ హైవే పనులు పూర్తయ్యాయి.

గ్రూపు-1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ: ఈ నెల 9న జరగనున్న గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర ఆదేశించారు. ప్రిలిమినరీ నిర్వహణ విషయమై శనివారం కలెక్టరేట్‌లో కో–ఆర్డినేషన్ కమిటీతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 47 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 16,899 మంది అభ్యర్థులు పరీక్షను రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుగా సంబంధిత విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లను నియమించామన్నారు. అభ్యర్థులు ఉదయం 10గంటల లోపే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 10 గంటల తర్వాత వస్తే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోరన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి చెప్పులు మాత్రమే వేసుకొని వెళ్లాలని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబడవని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను జూన్ 1 మధ్యాహ్నం రెండు గంటల నుంచి www.tspsc.gov.in ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఉదయం 9:30 గంటల నుంచి అభ్యర్థుల బయోమెట్రిక్ ప్రారంభమవుతుందని, ఎగ్జామ్ తర్వాత వెళ్లే ముందు కూడా బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందన్నారు. బయోమెట్రిక్ వేయని అభ్యర్థుల ఓఎంఆర్‌ను మూల్యాంకనం చేయబోరన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఆర్డీఓ రవి, డీఎస్పీ శివరాంరెడ్డి, డీఈఓ భిక్షపతి పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. ఇక అలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలను గావించారు. సాయంత్రం వేళ స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు.వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

పట్టభద్రుల ఓట్లు జాగ్రత్తగా లెక్కించాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరిచందన

నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, పట్టభద్రుల ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన అన్నారు. శనివారం ఆమె నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, ఏఆర్‌ఓలకు ఓట్ల లెక్కింపుపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మొదటి రౌండు చాలా ముఖ్యమని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు ఎలాంటి ఇంకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, సెల్‌ఫోన్ వంటివి తీసుకురావడానికి అనుమతి లేదన్నారు. దుప్పలపల్లి గోదాంలో 4 హాళ్లలో ఓట్ల లెక్కింపునకు 96 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 5న ఉదయం 6 గంటలకు ఓట్ల లెక్కింపు సిబ్బందంతా కేంద్రం వద్ద రావాలని, ఉదయం 8 గంటలకు కచ్చితంగా ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ప్రతి హాల్‌కు అదనపు కలెక్టర్, ఒక ఏఆర్‌ఓ ఇన్‌చార్జిగా ఉంటారని తెలిపారు. 12 టేబుళ్లకు ఒక ఆర్డీఓ చొప్పున ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లన్నింటినీ కలుపుకొని బ్యాలెట్ పేపర్ లెక్కించాల్సి ఉంటుందని, చెల్లుబాటైన ఓట్లు, చెల్లని ఓట్లను జాగ్రత్తగా పరిశీలించి లెక్కించాలన్నారు. ఈ శిక్షణకు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌తో పాటు, అన్ని 12 జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, ఏఆర్వోలు హాజరయ్యారు.

ఓట్ల లెక్కింపునకు అందరూ సహకరించాలి

పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించడానికి అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సహకరించాలనికలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన కోరారు. శనివారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓట్ల లెక్కింపునకు ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంటును అభ్యర్థులు నియమించుకోవచ్చన్నారు. ఈ నెల 2లోపు ఏజెంట్ల పేర్లు, ఫొటోలు ఇచ్చి వారి ఐడెంటిటీ కార్డులను తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజైన ఈ నెల 5న ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, వారి ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్ దగ్గరకు వచ్చాకే వారి సమక్షంలోనే బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ హాళ్లకు తరలిస్తామన్నారు. కౌంటింగ్ రోజు ఏజెంట్లు అందరూ ఉదయం 8 గంటలలోపే వారికి కేటాయించిన టేబుళ్ల వద్ద ఉండాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరిచందన.. దుప్పలపల్లి గోదాం వద్ద ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓట్ల కౌంటింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన, చిత్రంలో వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కొండమల్లేపల్లి: ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలంలోని జోగ్యతండా సమీపంలో శనివారం జరిగింది. వివరాలు.. కొండమల్లేపల్లి మండలంలోని దేశముకోనికుంట గ్రామానికి చెందిన అందుగుల లింగయ్య(48) స్వగ్రామం నుంచి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా జోగ్యతండా సమీపంలో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లింగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి ఘటనా స్థలానికి చేరుకుని లింగయ్యను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుండెపోటుతో ఏపీఎం మృతి


అనూక్ (ఫైల్)

మాడుగులపల్లి: మండల ఏపీఎం అనూక్ గుండెపోటుతో శనివారం మృతిచెందారు. కొంతకాలంగా హృద్రోగ సమస్యతో బాధపడుతున్న ఆయనకు శనివారం తెల్లవారుజామున ఇంట్లో గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో ప్రాణాలు కోల్పోయాడు. అనూక్ మృతి పట్ల వెలుగు కార్యాలయం సిబ్బంది, స్వయం సహాయ సంఘాల సభ్యులు విచారం వ్యక్తం చేశారు. తిప్పర్తి మండల కేంద్రానికి చెందిన అనూక్ గతంలో వేములపల్లి మండలంలో ఏపీఎంగా పనిచేశారు. ఆరు నెలల క్రితం జరిగిన మాడుగులపల్లికి వచ్చారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పెద్దఅడిశర్లపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గుడిపల్లి మండలం సూర్యపల్లి గ్రామంలో శనివారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యపల్లి గ్రామానికి చెందిన తేలుకుంట్ల రాఘవేందర్‌రెడ్డి (38) తన అత్తగారి ఊరైన కొండమల్లేపల్లి మండలం కాల్వపల్లిలో ఉంటూ స్వగ్రామంలో, కాలువపల్లిలో వ్యవసాయం చేయడంతో పాటు కొండమల్లేపల్లిలోని ఓ వైన్స్‌లో పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులకు తాళలేక శనివారం తెల్లవారుజామున వైన్ షాపులో లెక్కలు చేసే పని ఉందని ఇంట్లో తన భార్యకు చెప్పి తన సొంత గ్రామమైన సూర్యపల్లిలోని తన వ్యవసాయ పొలం వద్దకు చేరుకుని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేవారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

పెన్‌పహాడ్: మండల పరిధిలోని ధర్మాపురం గ్రామంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించేందుకు వెళ్లగా.. స్వామివారి విగ్రహం వెనక గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు కనిపించినట్లు గ్రామస్తులు తెలిపారు.

టోల్ బాదుడు

నేటి అర్ధరాత్రి నుంచి అమల్లోకి..
- హైదరాబాద్ – విజయవాడ హైవేపై పెరిగిన టోల్ రుసుం

చౌటుప్పల్, కేతేపల్లి: హైదరాబాద్–విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారిపై వాహనదారుల నుంచి వసూలు చేస్తున్న టోల్ ఫీజును రహదారి విస్తరణ కాంట్రాక్టు సంస్థ జీఎమ్మార్ పెంచింది. ఈ పెంచిన రేట్లు నేటి అర్ధరాత్రి తర్వాత అమల్లోకి రానున్నాయి. ఏటా మార్చి 31వ తేదీ అర్ధరాత్రి నుంచి టోల్‌చార్జీలు పెంచటం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో టోల్‌ఛార్జీల పెంపును జీఎమ్మార్ యాజమాన్యం వాయిదా వేసిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా శనివారంతో ఎన్నికలు ముగియటంతో టోల్ చార్జీల పెంపు అమలుకు జీఎమ్మార్ యంత్రాంగం సిద్ధమైంది. ఒక్కో వాహనానికి ఒక వైపు, ఇరువైపులా కలిపి రూ.5 నుంచి 40 వరకు, స్థానికులకు నెలవారీ పాస్‌ను రూ.330 నుంచి రూ.340కి పెంచారు.

181.5 కిలోమీటర్ల పరిధిలో..

యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండల అంథోల్ మైసమ్మ దేవాలయం నుంచి ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వరకు గల 181.5 కిలోమీటర్ల రహదారిని దాదాపు రూ.2000 కోట్ల వ్యయంతో 2012లో బీఓటీ పద్ధతిన జీఎమ్మార్ సంస్థ నాలుగు లేన్లుగా విస్తరించింది. ఈ విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వద్ద మూడు టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 2012 నుంచి టోల్‌ఫీజు వసూలు చేస్తోంది. ఎన్‌హెచ్‌ఏఐ సూచించిన నిబంధనల మేరకు వార్షిక సవరణల పేరిట ఏడాదికి ఒకమారు టోల్‌ఫీజు ధరలను పెంచుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ మేరకు జీఎంఆర్ సంస్థ ఈనెల 2(ఆదివారం) అర్ధరాత్రి 12 గంటల తర్వాత నుంచి ఆయా టోల్‌ప్లాజాల వద్ద పెంచిన టోల్ ధరలు అమల్లోకి తేస్తోంది. ఏడాది కాలం పాటు ఇవే ధరలు అమల్లో ఉంటాయి.


కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

పెరిగిన టోల్‌ఫీజులు ఇలా..

	పంతంగి		కొర్లపహాడ్	
వాహనము	ఒకవైపు	ఇరువైపులా	ఒక వైపు	ఇరువైపులా
కారు,జీపు, వ్యాను	95	145	130	195
లైట్‌కమర్షియల్, గూడ్స్	150	230	205	310
బస్సు, ట్రక్కు	315	470	430	640
భారీ వాహనాలు	485	725	665	995
అతి భారీ వాహనాలు	605	910	825	1240

యాదాద్రిలో సంప్రదాయ దుస్తులపై ప్రచారం


అష్టభుజి ప్రాకార మండపం వద్ద బుకింగ్ కౌంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలతో పాటు బ్రేక్ దర్శనాల్లో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు వేసుకోవాలని ఇప్పటికే ఆలయ ఈఓ భాస్కర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగానే ఆలయ మాడ వీధుల్లో, క్యూలైన్లలో, అష్టభుజి ప్రాకార మండపంలోని బ్రేక్ టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ఫ్లెక్సీలకు ఏర్పాటు చేశారు. నిత్య కల్యాణం, సుప్రభాతం, శ్రీసుదర్శన నారసింహ హోమం, బ్రేక్ దర్శనం, జోడు సేవలు వంటి పూజల్లో పాల్గొనే భక్తులు కచ్చితంగా సంప్రదాయ దుస్తులు వేసుకోవాలని ఫ్లెక్సీలపై రాయించారు. శనివారం నుంచి ఈ నిబంధన అమలులోకి వచ్చినప్పటికీ.. భక్తులు అలవాటు పడేందుకు 15రోజులు ప్రచారం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

ఆంజనేయుడికి లక్ష నాగవల్లి దళపత్ర అర్చన


ఆంజనేయస్వామికి లక్ష తమలపాకులతో అర్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయాల్లో ఆంజనేయస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి విష్వక్సేనారాధన, వాసుదేవ శుద్ధి, పుణ్యాహవచనం, స్నపన ఆరాధన, మన్యు సూక్త పారాయణంతో పాటు పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం లక్ష నాగవల్లి దళపత్రాలతో క్షేత్రపాలకుడికి సహస్ర నామార్చన నిర్వహించారు.

తూర్పు మాడ వీధిలో రూ.150 టిక్కెట్ దర్శనం క్యూలైన్..

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ ఈఓ భాస్కర్‌రావు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే స్వామి వారి దర్శనం టిక్కెట్ రూ.150 కొనుగోలు చేసే భక్తులు ప్రధానాలయంలోకి సులువుగా వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వీఐపీ పార్కింగ్ ముందు గల ప్రధాన బుకింగ్ కౌంటర్ నుంచి ర్యాంప్ మీదుగా క్యూకాంప్లెక్స్‌కు వెళ్లి, అక్కడి నుంచి గోల్డ్ క్యూలైన్ మార్గంలో తూర్పు ద్వారం నుంచి ఆలయంలోకి వెళ్లేవారు. కానీ ఇప్పుడు ఆ టిక్కెట్ కొనుగోలు చేసే భక్తులు నేరుగా తూర్పు ద్వారం నుంచి వెళ్లేందుకు క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నారు. తూర్పు మాడ వీధిలో ప్రత్యేక షెడ్డు వేసి, అందులో 10 క్యూలైన్లు ఏర్పాటు చేసి అష్టభుజి ప్రాకార మండపం నుంచి తూర్పు ద్వారం గుండా ఆలయంలోకి వెళ్లేలా ఆలయాధికారులు పనులు చేస్తున్నారు.

పశువులు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

- రూ.2.85లక్షల నగదు, 11 పశువులు, రెండు టాటా ఏస్ వాహనాలు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

నల్లగొండ క్రైం: రాత్రివేళ వ్యవసాయ క్షేత్రాల వద్ద కట్టేసిన పశువులను ఎత్తుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఆరుగురు సభ్యుల ముఠాను తిరుమలగిరి(సాగర్) పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతల్‌తండాకు చెందిన బానోతు మధు, గుగులోతు కృష్ణప్రసాద్, చిలుకూరు మండలం జానకినగర్‌కు చెందిన బానోతు దేవేందర్, నల్లగొండ జిల్లా ఎస్.తిరుమలగిరి మండలం చింతలపాలెంకు చెందిన ఎల్లెంల సీతారామయ్య, అదే గ్రామానికి చెందిన అంతటి బాలయ్య, తిరుమలగిరి(సాగర్)కు చెందిన ఎనమల్ల సిద్దులు కలిసి ముఠాగా ఏర్పడి గత రెండేళ్లుగా పశువులను చోరీ చేస్తున్నారు. తిరుమలగిరి(సాగర్) మండలంలోని కొందరు రైతులు తమ పశువులు చోరీకి గురయ్యాయని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి టాటా ఏస్ వాహనాల్లో నిందితులు పారిపోతుండగా వారిని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన పశువులను టాటా ఏస్ వాహనంలో తీసుకెళ్లి సంతల్లో, హైదరాబాద్‌లో, ఏపీ సరిహద్దు గ్రామాల్లో తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఠా సభ్యులందరికీ పశువుల వ్యాపారం ఉండటంతో వీరికి పరిచయం ఏర్పడిందన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి 11 పశువులు, రెండు టాటా ఏస్ వాహనాలు, రూ.2.85లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన నాగార్జునసాగర్ సీఐ బీసన్న, ఎస్‌ఐ నారాయణరెడ్డి, సిబ్బంది నగేష్, నాగరాజు, హేమంత్, ప్రశాంత్, అంజి, శ్రీను, నర్సిరెడ్డి, శ్రీకాంత్‌ను ఆయన అభినందించారు.

లారీ డ్రైవర్‌పై దుండగుల దాడి

- కాళ్లు, చేతులు కట్టేసి రూ.22వేలు చోరీ

నార్కట్‌పల్లి: గుర్తుతెలియని వ్యక్తులు లారీ డ్రైవర్ కాళ్లు, చేతులు కట్టేసి రూ.22వేలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఏపీ లింగోటం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన జడిగల ఎల్లేశ్ తన సొంత లారీలో శుక్రవారం రాత్రి ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు మామిడి మొద్దుల లోడుతో వెళ్తున్నాడు. మార్గమధ్యలో శనివారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు మహిళలు రోడ్డుపై నిల్చొని టార్చిలైట్ వేశారు. దీంతో ఎల్లేశ్ లారీ ఆపి కిందికి దిగి వారితో మాట్లాడుతుండగా.. వెనుక నుంచి ఇద్దరు పురుషులు వచ్చి ఎల్లేశ్ రెండు కాళ్లు పట్టుకొని వెనుకకు గుంజి కింద పడేసి వైరుతో చేతులు, కాళ్లు కట్టేశారు. డబ్బులు ఎక్కడ పెట్టావని ఎల్లేశ్‌ను అడగగా.. టూల్‌బాక్సులో ఉన్నాయని చెప్పడంతో అందులోని రూ. 22వేలు తీసుకొని ఎల్లేశ్‌ను సమీపంలో ఉన్న కాలువ వద్ద పడేసి పారిపోయారు. కొద్దిసేపటి తర్వాత ఎల్లేశ్ కట్లు విప్పుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

మహిళ బ్యాగులోని బంగారం అపహరణ

భువనగిరి క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ బ్యాగులోని బంగారం అపహరించారు. ఈ ఘటన శనివారం భువనగిరి బస్టాండ్‌లో జరిగింది. వివరాలు.. తుర్కపల్లి మండలం రుస్తాపురం గ్రామానికి చెందిన మహిళ భువనగిరి పట్టణంలోని ఓ జువెల్లరీ షాపులో రెండున్నర తులాల బంగారం కొనుగోలు చేసి బ్యాగులో పెట్టుకుని భువనగిరి బస్టాండ్‌కు వచ్చింది. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఆమె బ్యాగులోని బంగారం చోరీ చేశారు. సదరు మహిళ స్వగ్రామానికి వెళ్లిన తర్వాత బ్యాగును చూసుకోగా బంగారం కనిపించలేదు. దీంతో తిరిగి భువనగిరికి వచ్చి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్ మిల్లులో చెలరేగిన మంటలు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండల కేంద్రంలోని సంతోష్ రైస్ మిల్లులో శనివారం మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఫైర్ సిబ్బందికి తెలియజేయడంతో మోత్కూరు నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేశారు. సకాలంలో పోలీస్, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని డీఎస్‌ఓ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని సభ్యుడితో పాటు ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయిస్తున్న మరో నిందితుడిని వరంగల్ టాస్క్‌ఫోర్స్, సంగెం పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం తెలిపారు. ఈ రెండు సంఘటనల్లో పోలీసులు సుమారు రూ.10లక్షల విలువైన 310కిలోల నకిలీ పత్తి విత్తనాలు, రెండు సెల్‌ఫోన్లు, రూ.10.10లక్షల విలువగల 122లీటర్ల నిషేధిత గడ్డి మందును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి.. వరంగల్ జిల్లా సంగెం మండలం గాంధీనగర్‌కు చెందిన కోడూరి శ్రీనివాస్‌రావు, వరుసకు మామ అయిన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ప్రాంతానికి చెందిన నగా మల్లేశ్వర్‌రావుతో కలిసి, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న గుంటూరు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన ఏటుకూరి సుబ్బారావు వద్ద నకిలీ పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ విత్తనాలు గ్లయోస్పెట్ గడ్డి మందును తట్టుకొనే శక్తి కలిగి ఉండటంతోపాటు పత్తి దిగుబడి అధికమని, కలుపు తీయాల్సిన అవసరం తగ్గుతుందని, స్థానిక డీలర్ల వద్ద ఈ విత్తనాలు లభ్యం కావని తప్పుడు ప్రచారం చేసి రైతులను నమ్మించి నకిలీ పత్తి విత్తనాలను ఎక్కువ ధరకు విక్రయించేందుకు శ్రీనివాస్‌రావు ప్రణాళిక రూపొందించుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, సంగెం పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు చెప్పారు. విక్రయానికి సిద్ధంగా ఉంచిన నకిలీ పత్తి విత్తనాలతోపాటు, ప్రభుత్వ నిషేధిత 50లీటర్ల గడ్డి మందును పోలీసులు స్వాధీనం చేసుకొని శ్రీనివాస్‌రావును అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మరో సంఘటనలో సంగెం మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెంతుల రాజేశ్ ప్రభుత్వ నిషేధిత గడ్డి మందును ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో రాజేశ్ ఇంట్లో తనిఖీ చేసి 72లీటర్ల గడ్డి మందును స్వాధీనం చేసుకునట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, హిటాచీ సీజ్


చెరువు పరిశీలిస్తున్న గనులు, భూగర్భవనరుల శాఖ సహాయ సంచాలకుడు జాకబ్

నల్లగొండ, కట్టంగూర్: కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామంలోని బురుజుకుంట చెరువు నుంచి అక్రమంగా ఒండ్రు మట్టి, మొరం తరలిస్తున్న 3 ట్రాక్టర్లు, ఒక హిటాచీ వాహనాన్ని శనివారం సీజ్ చేసినట్లు నల్లగొండ జిల్లా గనులు భూగర్భవనరుల శాఖ సహాయ సంచాలకుడు జాకబ్ తెలిపారు. బురుజుకుంట చెరువులో నుంచి ఒండ్రు మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు శనివారం ఫిర్యాదు చేశారని, కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా చెరువులో సుమారు 10 నుంచి 15 ఫీట్ల లోతులో ఒండ్రు మట్టి, మొరం తరలించినట్లు గుర్తించామని ఆయన తెలిపారు. సమీపంలోనే నెల రోజుల నుంచి 140 మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. మట్టిని తవ్వుతున్న హిటాచీ వాహనంతో పాటు 3 ట్రాక్టర్లను సీజ్ చేసి కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. చెరువుల్లో అక్రమంగా తవ్వకాలు జరిపితే జరిమానా, జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు.

ఏఎస్‌ఐ పేరు చెప్పి రూ.85,000 టోకరా

మోత్కూరు: గుర్తుతెలియని వ్యక్తి ఏఎస్‌ఐగా పరిచయం చేసుకుని పెట్రోల్ బంక్ నిర్వాహకులకు రూ.85000 టోకరా వేశాడు. వివరాలు.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ నిర్వాహకుడు గండె ఉమేష్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి తాను ఏఎస్‌ఐ భాస్కర్ మాట్లాడుతున్నానని.. అత్యవసరంగా ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.85,000 ఫోన్ పే చేయాలని చేశాడు. దీంతో బంక్ యజమాని గండె ఉమేష్ బంక్ మేనేజర్ ప్రశాంత్‌కి చెప్పగా.. అతడు రూ.25,000 ఒకసారి, మరోసారి రూ.60,000 ఫోన్ పే చేశాడు. అనంతరం అదే నంబర్‌కి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మేనేజర్‌కు అనుమానం వచ్చి బంక్ యజమాని ఉమేష్‌కు విషయం చెప్పాడు. వారికి అనుమానం వచ్చి ట్రూకాలర్‌లో ఆ వ్యక్తి చేసిన ఫోన్ నంబర్‌ను చూడగా జార్ఖండ్ రాష్ట్రం నుంచి ఫోన్ చేసినట్లు చూపించింది. తాను మోసపోయినట్లు గుర్తించిన బంక్ మేనేజర్ ప్రశాంత్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

బైక్‌పై వెళ్తూ గేదెలను ఢీకొట్టి వ్యక్తి మృతి


చెన్నయ్య(ఫైల్)

పెన్‌పహాడ్: బైక్‌పై వెళ్తూ గేదెలను ఢీకొట్టి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ శివారులో ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన ఐతరాజు చెన్నయ్య(49) మండల కేంద్రంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో సీసీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా... పెన్‌పహాడ్ మండల కేంద్రం శివారులో గేదెలు అడ్డురావడంతో వాటిని ఢీకొట్టి కిందపడిపోయాడు. స్థానికులు అతడిని సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం మృతుడి భార్య ప్రవీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చెన్నయ్య మృతదేహానికి డీఆర్‌డీఓ మధుసూదనరాజు, అదనపు డీఆర్‌డీఓ సురేష్ తదితరులు నివాళులర్పించారు.

సప్లిమెంటరీ పరీక్షలు రాసి వస్తూ..

ఆత్మకూర్ (ఎస్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన దేశగాని లింగయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు దేశగాని చందు(19) శనివారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు గ్రామానికి చెందిన తన స్నేహితుడు ఇరుగుదిండ్ల రాకేష్‌తో కలిసి తన అమ్మమ్మ ఊరైన రామన్నగూడేనికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ దాటగానే గేదెను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో చందు అక్కడికక్కడే మృతిచెందగా.. గాయాలపాలైన రాకేష్‌ను స్థానికులు సూర్యాపేటకు తరలించారు. ఈ ప్రమాదంలో గేదె కూడా మృతిచెందింది. చందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.

నూతన జిల్లా కేంద్రాల్లో అన్ని కోర్టులు ఏర్పాటు చేయాలి

- మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శశిధర్


జే. శశిధర్

చివ్వెంల(సూర్యాపేట): రాష్ట్ర వ్యాప్తంగా కొత్త జిల్లాల్లో కక్షిదారులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని కోర్టులు ఏర్పాటు చేయాలని మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జే. శశిధర్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని జిల్లా కేంద్రాల్లో జిల్లా కోర్టులు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అదేవిధంగా కక్షిదారులకు అవసరమైన ఇంకా కొన్ని కోర్టులు ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత కోర్టులను నూతన జిల్లా కోర్టుల్లో ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు. వీటిలో భాగంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు, వినియోగదారుల ఫోరం కోర్టు, మహిళా కోర్టు, ఫ్యామిలీ కోర్టులను ఏర్పాటు చేయాలని కోరారు. దీని వల్ల ప్రజలకు దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఉండవన్నారు. ఇప్పటికే నూతన జిల్లాల్లో కోర్టుల నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించిందన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు


శ్యామల

హుజూర్‌నగర్: యువతి తప్పిపోయినట్లు ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం హుజూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన వళ్లపు లచ్చయ్య కుమార్తె శ్యామల 20 రోజుల క్రితం హుజూర్‌నగర్‌లో ఉంటున్న తన పెద్దనాన్న కుమార్తె లోడంగి విజయలక్ష్మి ఇంటికి వచ్చి పట్టణంలో కుట్టుమిషన్ నేర్చుకుంటోంది. మే 23న శ్యామల మిషన్ నేర్చుకునేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ ఎంత ప్రయత్నించినా దొరకలేదు. దీంతో ఆమె తండ్రి వళ్లపు లచయ్య శనివారం హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

- మేడ్చల్ జిల్లాలో ఘటన
- మృతురాలి స్వస్థలం నకిరేకల్


సంగీత (ఫైల్)

నకిరేకల్: గ్రూప్స్ కోసం సన్నద్ధమవుతూ ఒత్తిడికి లోనైన యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా రాఘవేంద్రనగర్‌కాలనీలో శనివారం జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన కోమరాజు సైదులు, ఉమా దంపతులకు ఒక కూమారుడు, ఒక కూమార్తె ఉన్నారు. ఎంబీఏ పూర్తిన చేసిన వారి కుమార్తె సంగీత(24) మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని రాఘవేంద్రనగర్‌లో రూం అద్దెకు తీసుకుని గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతోంది. ఈ క్రమంలో ఒత్తిడికి లోనైన సంగీత తాను అద్దెకు ఉంటున్న రూంలోనే శనివారం ఉదయం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంగీత సోదరుడు తన అక్క కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఆమెకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఆమె ఉండే రూంకు వెళ్లగా.. ఉరేసుకుని కనిపించింది. దీంతో తన తల్లిదండ్రులు, స్థానిక పోలీసులుకు సమాచారం ఇచ్చాడు. సంగీత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని సంతోష్‌నగర్‌లో ఒక గది అద్దెకు తీసుకుని ఒంటరిగా నివాసముంటున్న రమేష్(45) సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్న అతడిని చుట్టుపక్కల వారు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమేష్ మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని.. అతని కుటుంబ వివరాలు తెలిసిన వారు 8712670150, 9966498185 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హెచ్‌సీయూ తెలుగుశాఖ విభాగాధిపతిగా నేరడ వాసి


రాములు

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, ఆచార్య పిల్లలమర్రి రాములు సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(హెచ్‌సీయూ) తెలుగుశాఖ విభాగాధిపతిగా శనివారం బాధ్యతలు చేపట్టారు. రాములు తెలుగుశాఖ విభాగాధిపతిగా బాధ్యతలు చేపట్టడంతో చిట్యాలకు చెందిన ప్రమోద సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కందిమళ్ల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ మోటార్లు చోరీ

చిలుకూరు: మండలంలోని 12 మంది రైతుల విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి. వివరాలు.. బేతవోలు శివారులో, సీతరాంతండా వద్ద రైతుల పొలాల్లోని విద్యుత్ మోటార్లతో పాటు కాపర్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. శనివారం రైతులు తమ పొలాల వద్దకు వెళ్లేసరికి మోటార్లు కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రణబోతు అమర్‌నాథ్‌రెడ్డి, పిట్ట వీరస్వామి, దేశబోయిన దుర్గేష్, దేశబోయిన శ్రీను, గుగులోతు కోటియ్యా, బానోతు పాప, బానోతు వెంకటేశ్వర్లు, కేశగాని వీరయ్య, బెల్లంకొండ శంకర్, బెల్లంకొండ అంజయ్యకు చెందిన విద్యుత్ మోటార్లు చోరీకి గురయ్యాయి.